సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం ၊ 9 ၊ ఏప్రిల్ ၊ 2024



టీడీపీ భూస్థాపితం ఖాయం

టీడీపీకి గడ్డుకాలం మొదలైందని, భూస్థాపితం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి చెప్పారు. 2లో

అంబరాన్నంటిన నూకాలమ్మ సంబరాలు



రాజవొమ్మంగిలో నూకాలమ్మ సంబరాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. దర్శనానికి భక్తులు పోటెత్తారు. 2లో

రంజాన్ వేళలు

పాడేరు, అరకు
ఇఫ్తార్ (మంగళ) 6.15 సహర్ (బుధ) 4.28
రంపచోడవరం
6.29 4.33

న్యాయం వైపు నిలబడండి





పాడేరులో వైఎస్సార్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వేదికపై అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థులు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పరిశీలకులు శోభ హైమవతి, పీలా వెంకటలక్ష్మి, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- ఎన్నికల యుద్ధంలో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలి
- పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల విస్తృతస్థాయి సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

పాడేరు/పాడేరు రూరల్(హుకుంపేట): సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ప్రజలంతా న్యాయం వైపు నిలబడాలని, ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యు లు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కోరారు. పట్టణంలోని వీఆర్ కల్యా ణ మండపంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీ టీసీలు, సర్పంచ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, ఇతర ముఖ్యనాయకులతో సోమవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా హామీలను నెరవేర్చలేదని చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో లక్షలాది రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. మేలు జరిగితేనే ఓటు వేయాలని చెబుతున్న నాయకుడు దేశంలో మరెక్కడా లేరన్నారు. ఈ ఐదేళ్ల సుమారు రూ.3 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసి చరిత్ర సృష్టించా మని చెప్పారు. నవరత్నాలు పథకాలతో గిరిజను లకు అధిక మేలు జరిగిందన్నారు. పాడేరు నియోజకవర్గంలో సుమారు 2.40 లక్షల మంది జనాభా ఉండగా వీరిలో 1.90 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా సుమా రు రూ.2,600 కోట్లను ప్రజల కోసం వెచ్చించినట్టు తెలిపారు. అరకు నియోజకవర్గంలో సుమారు 2.36 లక్షల మంది జనాభాకు గాను 1.78 లక్షల మందికి డీబీటీ,నాన్ టీబీటీల ద్వారా రూ.1,700 కోట్ల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు ఒకవైపు ఉంటే ప్రజలతో ఉన్న వైఎస్సార్‌సీపీ మరో వైపు ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకున్న సమస్య లను అధికారంలోకి వచ్చాక పరిష్కరించారని తెలి పారు. ఏవైనా సమస్యలు ఉన్నాయేమోనని తెలుసుకునేందుకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారన్నా రు. టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రజలను మోసగించడానికి జతకట్టి వస్తున్నాయని తెలిపారు. ఆ పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టించి పనిచేయాలని, కష్టించిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కేలా చూస్తామన్నారు. జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయంగా వేరే చట్టాన్ని తీసుకువచ్చి గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టించి పని చేస్తే సామాన్య కార్యకర్తలకు కూడా ఉన్నత పదవులు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు గుర్తింపు లభించిందని చెప్పారు. పాడేరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సామాన్యుల పార్టీ అని తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అతి మారుమూల తమ గ్రామమైన కిల్లంకోటకు రహదారి, ఇతర మౌలిక వసతులు సమకూరాయని చెప్పారు. అత్యంత మారుమూల గిరిజన గ్రామంలో పుట్టిన తనకు వైఎస్సార్‌సీపీ ఏకంగా ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చిందన్నారు. అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరించాలని సూచించారు. జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, ఈసారి ఎన్నికల్లో కూడా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాల్సిన అవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అరకులోయ నియోజకవర్గంలో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులుజరిగాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన సన్మానం

రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా జిల్లాకు వచ్చిన వైవీ సుబ్బారెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి, దుశ్శాలువాలతో సన్మానించారు. సమావేశం అనంతరం పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండలాల వారీగా క్యాడర్‌తో సమావేశమై అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వైవీ సుబ్బారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పార్టీ పరిశీలకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, శోభ హైమవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, సంయుక్త కార్యదర్శి కూడ సురేష్ కుమార్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, 11 మండలాల క్యాడర్ పాల్గొన్నారు.

టీడీపీకి మిరియాల ఘాటు

రంపచోడవరం నియోజకవర్గం టీడీపీలో అసంతృప్తి జ్వాలలు మిన్నంటుతున్నాయి. అభ్యర్థిగా మిరియాల శిరీషదేవిని ప్రకటించినప్పటి నుంచి అసమ్మతి నేతలు అధిష్టానంపై కారాలు,మిరియాలు నూరుతున్నారు. అభ్యర్థిని మార్చాలన్న డిమాండ్ రోజురోజుకు పెరుగుతోంది. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థిని మార్చాలని తీర్మానాలు చేస్తూ అధిష్టానానికి పంపుతున్నారు. మరో వైపు టీడీపీ అభ్యర్థి నిర్వహించిన సమన్వయ సమావేశానికి పలువురు నేతలు గైర్హాజయ్యారు. దీంతో పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది.

- రంప టీడీపీలో కారాలు,మిరియాలు నూరుతున్న అసమ్మతి
- అభ్యర్థిని మార్చాలని రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్
- సొంత మండలం రాజవొమ్మంగిలోనూ శిరీష దేవిపై తీవ్ర వ్యతిరేకత



మిరియాల శిరీషను మార్చాలని కోరుతూ గంగవరంలో సమావేశమైన టీడీపీ నాయకులు

రంపచోడవరం: రంపచోడవరం నియోజకవర్గంలోని అసమ్మతి ఘాటు టీడీపీ అధిష్టానం నషాలన్ని అంటుతోంది. అభ్యర్థిగా మిరియాల శిరీషదేవిని ప్రకటించిన నాటి నుంచి అగ్రహంతో కార్యకర్తలు, నాయకులు అధిష్టానంపై కారాలు, మిరియాలు నూరుతున్నారు. అభ్యర్థిని మార్చాలని అధినాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో టీడీపీ ఉనికి కోసం కష్టపడిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి టికెట్ కేటాయించాలని ఆ దిశగా టీడీపీ అధ్యక్షుడు ఆలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల గంగవరం మండలంలో టీడీపీ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం జరిగింది. ఎప్పుడూ పార్టీ జెండా కూడా పట్టుకోని మిరియాల శిరీష దేవికి ఎలా టికెట్ కేటాయిస్తారంటూ ఆ సమావేశంలో పలువురు నాయకులు మండిపడ్డారు. రంపచోడవరం టికెట్ విషయంలో అధిష్టానం పునరాలోచన చేయాలని తీర్మానించారు. మిరియాల శిరీష దేవికి తప్ప పార్టీలో కష్టపడిన వారిలో ఎవరికి టికెట్ ఇచ్చిన మాకు సమ్మతమేనంటూ తీర్మానించారు. సొంత మండలం రాజవొమ్మంగిలో కూడా శిరీషదేవిపై తీవ్ర వ్యతిరేకత ఉంది. మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో ఇటీవల జరిగిన సమావేశంలో కూడా అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేసి పార్టీ పరిశీలకుడికి పంపినట్టు తెలిసింది. రెండు రోజుల కిందట రంపచోడవరం మండలంలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థిని మార్చాలని తీర్మానం చేశారు. వై. రామవరం, కూనవరం మండలాల్లో కూడా అభ్యర్థి మార్పుపై తీర్మానాలు చేశారు.

సమన్వయ సమావేశానికి హాజరుకాని ముఖ్య నాయకులు

రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మార్పుపై ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో సోమవారం మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని రంపచోడవరంలో నిర్వహించారు. అయితే సమావేశానికి కొన్ని మండలాల నుంచి పార్టీ ముఖ్యనాయకులతో పాటు పార్టీ మండల అధ్యక్షులు కూడా హాజరు కాలేదు. మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరిలు సమావేశానికి గైర్హాజరయ్యారు, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్ మాత్రం హాజరయ్యారు. సమావేశంలో కూటమి పార్టీలు జనసేన, బీజేపీలతో కలిసి పనిచేయాలని చర్చించినట్టు తెలిసింది. టీడీపీ నాయకుల మధ్య సమన్వయం లేని పరిస్థితుల్లో ఎన్నికల్లో పనిచేయడం కష్టమని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీని చీల్చిన వారి కోసం ఎలా పనిచేస్తామంటున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా ధారాలమ్మ ప్రధాన పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సీలేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం ధారాలమ్మ అమ్మవారి ఆలయ 52వ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రధాన పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 03.51 గంటలకు పండగను ముగించి, ఆలయ గర్భగుడి తలుపులు మూసివేశారు. మళ్లీ మంగళవారం ఉదయం ఉగాది రోజున గర్భగుడిని తెరిచి అమ్మవారి దర్శనానికి భక్తులకు అనుమతి ఇస్తామని ఈవో సాంబశివరావు తెలిపారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈవో సాంబశివరావు

పాఠశాలల్లో వాటర్ బెల్



వాటర్ బెల్ సమయంలో విద్యార్థులతో నీళ్లు తాగిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం : ఎండల తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని పాఠశాలల్లో వాటర్ బెల్ మోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖ ఆదేశాల మేరకు సోమవారం రంపచోడవరం డివిజన్‌లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ బెల్ మోగించి పిల్లలచే నీళ్లు తాగించారు. ఎండల కారణంగా విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు రోజులో మూడు సార్లు బెల్ మోగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.ఉదయం 8.45, 10.50, 11.50 గంటలకు ఈ వాటర్ బెల్ మోగించనున్నట్టు ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు.

చర్చిలో ప్రచారం, ఆత్మీయ సమావేశం

- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించిన పాడేరు టీడీపీ అభ్యర్థి



ప్రార్థనలు నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకటరమేష్ నాయుడు, అనంతరం ఇక్కడే సమావేశం నిర్వహించారు

పాడేరు: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకటరమేష్ నాయుడు, బీజేపీ నేతలు ఎన్నికల నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రార్థనామందిరాల్లో రాజకీయ సమావేశాలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహించకూడదు. అయితే టీడీపీ నేతలు ఆ నిబంధనలను ఉల్లంఘించారు. టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకటరమేష్‌నాయుడు, బీజేపీ నాయకులతో కలిసి సోమవారం మండలంలోని వంట్లమామిడి పంచాయతీ ఓనూరు, నంగిగరువు గ్రామాల్లో పర్యటించారు. నంగిగరువు చర్చిలో 40 మంది పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించి,ప్రచారం చేశారు. రానున్నఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఎన్నికల నియమావళిను ఉల్లంఘించిన టీడీపీ అభ్యర్థిపై వెంకటరమేష్ నాయుడుపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

నవగ్రహ మండపంలో విగ్రహం చోరీ



నవగ్రహ విగ్రహాల్లో ఓ విగ్రహం లేని దృశ్యం

చింతూరు: మండలంలోని చట్టిలో స్వయంభూ గాదె రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఓ విగ్రహం చోరీకి గురైంది. ఆలయంలో ఉన్న నవగ్రహ మండపంలోని విగ్రహాల్లో ఒక విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరు గిరిజనుల మృతి

- వనుగుమ్మ పంచాయతీ అసరాడ కొండపై ఘటన
- మృతులలో ఒకరు ఒడిశా వాసి
- కిరాంబో గ్రామంలో విషాదఛాయలు



సుఖదేవ్,సీతారాం మృతదేహాలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ కొండపై పిడుగుపడి ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.మృతుల్లో ఒకరు ఇదే పంచాయతీ కిరాంబో గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, మరొకరు ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనుగుమ్మ పంచాయతీ కిరాంబో గ్రామానికి చెందిన 15 మంది, ఒడిశాకు చెందిన ఒకరు సోమవారం అసరాడ కొండ ప్రాంతంలో కె.గంగాధర్ చెందిన జీడితోటలలో జంగిల్ కటింగ్ పనులు చేస్తుండగా సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో చిరుజల్లు కురవడం ప్రారంభమైంది. దీంతో పనుల నిలిపివేసి,కొండ ప్రాంతం నుంచి కిరాంబో గ్రామానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వర్షం ఎక్కువగా కురవడంతో చెట్ల కింద ఉండిపోయారు.ఆ సమయంలో పెద్ద శబ్దంతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో ఆ చెట్టుకింద ఉన్న కిరాంబో గ్రామానికి చెందిన పాంగి సుఖదేవ్(32), ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పప్పరుమెట్ట గ్రామానికి చెందిన కొర్ర సీతారాం(34) తీవ్రంగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. కిరాంబో గ్రామానికి చెందిన పాంగి సిద్ధేష్, పాంగి చిన్నబాబులకు స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన దేవ, నీలకంఠం, సీపీఎం నేత శంకర్‌రావులు సంఘటన స్థలానికి వెళ్లి స్థానికుల సాయంతో మృతదేహాలను కిరాంబో గ్రామానికి తరలించారు. తమకు దిక్కెవరని మృతుల కుటుంబ సభ్యులు భోరున విలపించారు. దీంతో కిరాంబోలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీఆర్‌వో రాంచందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృత్యులకు భార్య, ఇద్దరు చొప్పున పిల్లలు ఉన్నారని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కిరాంబో గ్రామస్తులు కోరారు.

ఎన్నికల విధులపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న డీటీ రామకృష్ణ


హాజరైన అధికారులు

రంపచోడవరం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా సెక్టార్ అధికారులు రూట్ అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల పనితీరుపై పూర్తిస్థాయిలో అవగాహనతో ఉండాలని డీటీ రామకృష్ణ తెలిపారు. ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం సెక్టార్ అధికారులు, రూట్ అధికారులతో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం నియోజకవర్గం ఆర్ఓ, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీటీ రామకృష్ణ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 11 మండలాల్లో 399 పోలింగ్ కేంద్రాలకు 73 మంది రూట్ అధికారులు, 59 మంది సెక్టార్ అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాడ్‌లపై శిక్షణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 399 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు ఎక్కడైనా మొరాయిస్తే సంబంధిత పోలింగ్ కేంద్రాల అధికారులు మీ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే రిటర్నింగ్ అధికారి సమాచారాన్ని అందించాలన్నారు. సెక్టార్ అధికారులు ఎన్నికల సంఘం నియమ నిబంధన ప్రకారం అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని ఆర్ఓ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. డీటీ సత్యనారాయణ, సుబ్బారావు, చైతన్య, శివ, స్వామి, విశ్వనాథం, శ్రీధర్, ఆర్ఐ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

- అరకు వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర


అల్లమ్ముల్లలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్, పరిశీలకులు జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: రానునన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ అల్లముల్ల, నడుమూరు గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గ పరిశీలకులు సుభద్ర పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఆమె ఇంటింటికీ వెళ్లి గిరిజనులకు అప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగంలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పాలనను అందిస్తున్నారని, ఈ సంక్షేమం ఇలానే కొనసాగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా మనమంతా గెలిపించుకోవాలన్నారు. బూటకపు హామీలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ప్రజల మధ్యకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో రెండు బటన్‌లను నొక్కి, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆమె కోరారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, సర్పంచులు నరసింగరావు, రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు మూర్తి, గాసిరావు, అప్పారావు, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతి, అర్జున్, రాంప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి షేప్‌లో

దొండకాయ


జీడిమామిడి పిక్కలను పోలి ఉన్న దొండకాయలు

రాజవొమ్మంగి: జీడిమామిడి సీజన్ కదా...ఫోటోలో కనుపిస్తున్నవి జీడిమామిడి గింజలే అనుకొంటే పొరపడినట్లే. ఇవి అచ్చం జీడిమామిడి పిక్కలను పోలి ఉన్న దొండకాయలు సుమా... రాజవొమ్మంగిలో ఓ పాదుకు కాస్తున్న దొండకాయలు ఇలా ఒంపు తిరిగి ఉండి జీడిమామిడి పిక్కల్ని తలపిస్తున్నాయి. సాధారణంగా దొండకాయలు పొడవుగా ఉంటాయి. ఇలా ఒంపు తిరిగి చిన్న చిన్నగా కనుపిస్తుండడంతో వాటిని గృహిణులు ఆసక్తిగా చూస్తున్నారు.

నేడు ఆరుగురు అర్చకులు, వేదపండితులకు సత్కారం

మహారాణిపేట: ఉగాది సందర్భంగా పలువురు అర్చకులు, వేద పండితులను సత్కరించనున్నామని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ (ఏసీ) కె.శిరీష తెలిపారు. జిల్లాలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న ఆరుగుర్ని గుర్తించామన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించే ఉగాది సంబరాల్లో అర్చకులు కె.అనంత వేంకట వరాహ కృష్ణమాచార్యులు, బుచ్చమ్మ, వి.నరసింహాచార్యులు, కె. శ్రీనివాస శర్మ, వాడపల్లి గోపాలాచార్యులు, కోటా పంచముఖి శర్మలను సత్కరించనున్నామన్నారు. సత్కారగ్రహీతలకు రూ.10,116 అందజేస్తామని చెప్పారు.

తనిఖీల్లో రూ.7.84 లక్షలు స్వాధీనం


నగదుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్, ద్వారకా పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఇద్దరు యువకులు వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై వెళుతుండా తనిఖీ చేశారు. ఈక్రమంలో క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ సంస్థకు చెందిన ఎల్.భాగ్యరాజ్ బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు రూ.4,14,542 తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. అలాగే రేడియంట్ సంస్థకు చెందిన ఉద్యోగి శివ సాయి చరణ్ వద్ద రూ.3,70,000 స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరిద్దరి వద్ద నగదుకు సంబంధించి అన్ని రశీదులు ఉన్నాయి. అయినప్పటికీ నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న నగదును నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ద్వారకా సీఐ, రమేష్, ఫ్లయింగ్ స్క్వాడ్ స్కాడ్ ఇన్‌చార్జి లోవరాజు తనిఖీల్లో పాల్గొన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కారును ఎస్ఐ.ధర్మేంద్ర, ఎఎస్ఐ, గంగాధర్‌రెడ్డి, కేంద్ర బలగాలు తనిఖీలు చేశారు.

అంబరాన్నంటిన నూకాలమ్మ సంబరాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రాజవొమ్మంగి : మండల కేంద్రం రాజవొమ్మంగిలో నూకాలమ్మ అమ్మ సంబరాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఏడాదికి ఒకే ఒక సారి తెరచుకునే ఈ అమ్మవారి గుడి వద్ద ఏటా మూడు రోజుల పాటు తిరునాళ్లు నిర్వహిస్తారు. మంగళవారం గుడి తలుపులు తిరిగి మూసివేసే సమయం ఆసన్నమవడంతో సోమవారం అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎక్కడెక్కడి నుంచోవచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు నిర్మించారు. తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించారు. డప్పువాయిద్యాల నడుమ ఆది, సోమవారాల్లో అమ్మవారి గరగ నృత్యాలు సాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకొన్నాయి. రాజవొమ్మంగి గ్రామదేవత నూకాలమ్మ జాగరణలు సందర్భంగా వీధివీధిని చలువ పందిళ్లు వేసి రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీలేరులో

సీలేరు: స్థానిక పవర్ హౌస్ వద్ద గల నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఏపీ జెన్‌కో ఇంజినీరు బుద్ధాన రమేష్‌కుమార్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు ,సారె సమర్పించారు. అనంతరం ఆలయ మండపంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఏలేరు వాగులో పడి రైతు మృతి


భద్రరావు మృతదేహం

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరానికి చెందిన రైతు పడాల భద్రరావు(55) ప్రమాదవశాత్తు ఏలేరు వాగులో పడి మృతి చెందాడు. ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన అతను ఎంతకీ ఇంటికి చేరకపోవడంతో బంధువులు వెతకసాగారు. అయితే సోమవారం ఉదయం ఏలేరు వాగులో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి అడ్డతీగల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, సీపీఎం కార్యకర్తలకు కండువా వేసి పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం

అరకులోయ రూరల్: టీడీపీకి గడ్డుకాలం మొదలైందని, భూస్థాపితం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలో చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ గొల్లోరి రాజు, సీపీఎం కార్యకర్త దామోదర్‌తో పాటు 50 కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం మాట్లాడుతూ టీడీపీకి నామరూపం లేకుండా చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు ఇతర రాజకీయ పార్టీల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతుండడం శుభ పరిణామమన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీగా తనూజారాణిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న రేగం మత్స్యలింగం అయిన నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ పొత్తుపార్టీలు ఇస్తున్న దొంగ హామీలను నమ్మొద్దన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, సత్రుగున్, రాంచందర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాసి, నాయకులు సీతారాం, బాలరాజు, రామారావు, నర్సింగ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

కార్చిచ్చు నుంచి అడవులను రక్షించాలి


మొల్లేరులో కళాజాత ప్రదర్శనను తిలకిస్తున్న సబ్ డీఎఫ్‌వో రామారావు

గంగవరం : అడవులను కార్చిచ్చు నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడ్డతీగల అటవీశాఖ సబ్‌డీఎఫ్‌వో బి.రామారావు అన్నారు. సోమవారం ఫోక్స్‌పేట ఫారెస్టు రేంజర్ ఎం.కరుణాకర్ ఆధ్వర్యంలో అడవుల్లో కార్చిచ్చు వల్ల కలిగే నష్టాలు – నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మొల్లేరు గ్రామంలో అవగాహన సదస్సు, కళాజాత నిర్వహించారు. ఈ సదస్సులో రామారావు మాట్లాడుతూ వేసవిలో అడవులు అంటుకుంటే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అడవుల్లో నిప్పు–మానవాళికి ముప్పు అంటూ రాజమహేంద్రవరానికి చెందిని విభూతి బ్రదర్స్ కళా బృందం ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది. డీఆర్వో సుజాత, అటవీశాఖాధికారులు నూకరాజు, అప్పారావు, వరలక్ష్మి, బీట్ ఆఫీసర్లు దుర్గా శ్రీను, సుభద్ర, అరుణ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం


మాట్లాడుతున్న రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ హెడ్ జోగినాయుడు

నాతవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూస్తే జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని సినీ నటుడు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ హెడ్ ఎల్. జోగినాయుడు అన్నారు. ఆయన సోమవారం కుటుంబ సమేతంగా జిల్లేడుపూడిలో బుచ్చెంపేట నూకాలమ్మ తల్లిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. బస్సు యాత్ర ప్రారంభంలో సీఎం జగన్‌తోపాటు ఇడుపులపాయకు వెళ్లి, రెండు రోజుల పాటు అయనతో బస్సు యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులంతా స్వచ్ఛందంగా బస్సు యాత్రకు తరలి వస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ జగన్ వస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని క్షేత్ర స్థాయిలో ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. ఎన్ని పార్టీలు కూటమి కట్టినా ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు చేప్పే మాయ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పింఛన్లు ఇవ్వకుండా వలంటీర్లను అడ్డుకున్న చంద్రబాబుపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపారు. వలంటీర్లు రాజీనామాలు చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించుకునేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. పొత్తుల కారణంగా ఎక్కడ ఏ గుర్తుకు ఓటేయాలో తెలియని అయోమయం వారిదైతే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలన్న నిర్ణయానికి జనాలు వచ్చారని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రతి రోజు టీడీపీ నుంచి అధిక సంఖ్యలో ముఖ్య నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరడం పార్టీలో మరింత జోష్ పెంచుతోందన్నారు.

నేడు అప్పన్న పెళ్లిరాట

సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి పెళ్లిరాట(ఉడుపురాట) మహోత్సవం జరగనుంది. ఈ నెల 19న చైత్ర శుద్ధ ఏకాదశి రోజు స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహణలో భాగంగా ఈ వేడుక నిర్వహించనున్నారు. సింహాచలం దేవస్థానం అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ఉత్తర ద్వారం, రాజగోపురం, నృసింహ మండపంలో పెళ్లిరాటలు వేస్తారు. ఉగాది పండిత సత్కారాలు, దాతలకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేయనున్నారు.

మైసూరు-భువనేశ్వర్ స్పెషల్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మైసూరు–భువనేశ్వర్–మైసూరు మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

- మైసూరు–భువనేశ్వర్(06215) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9న మైసూరులో తెల్లవారుజామున 4.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.35 గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 10.40 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–మైసూరు(06216) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 7.15 గంటలకు మైసూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 1–సెకండ్ ఏసీ, 3 థర్డ్ ఏసీ, 9–స్లీపర్‌క్లాస్, 3–జనరల్ సెకండ్ క్లాస్, 1–సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించిన రైల్వే శాఖకు సహ కరించాలని ప్రకటనలో కోరారు.

'షూ'టయ్యేలా..!

- విద్యార్థుల పాదాల కొలతల సేకరణ
- బడితెరిచిన తొలిరోజునే విద్యాకానుక
- తొమ్మిది రకాల వస్తువులతో ప్రత్యేక కిట్ అందజేత
- ప్రతీ విద్యార్థికి రూ.1,964 వ్యయంతో విద్యాకానుక, ఇది మార్కెట్‌లో రూ.5 వేలు పైమాటే..


అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల పాదాల కొలతలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు


గతేడాది కానుక అందుకున్న విద్యార్థి

విశాఖ విద్య: విద్యారంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. పేద బిడ్డలు సైతం కార్పొరేట్ స్కూళ్లకు వెళ్లే వారికి మించి టిప్పుటాప్‌గా ఉండాలనే తపనతో విద్యాకానుక రూపంలో యూనిఫారాలు ఉచితంగా అందజేస్తోంది. వీటితో పాటు షూ, రెండు జతల సాక్స్‌లను ఏటా విద్యార్థులకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2024–25 విద్యా సంవత్సరానికి బడితెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు విద్యాకానుకను అందజేసేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, వివాదాలకు తావులేకుండా కానుకలోని వస్తువులను సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా కానుక

ప్రతీ విద్యార్థి పాదాల సైజుకు అనుగుణంగానే బూట్లను పాఠశాలలకు సరఫరా చేసేలా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా జిల్లాలోని పాఠశాలల వారీగా విద్యార్థుల పాదాల కొలతలను సేకరిస్తున్నారు. పాఠశాలల హెచ్ఎంల పర్యవేక్షణలో విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో విద్యార్థుల పాదాల కొలతల వివరాలను పొందుపరుస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మేరకు, వారి పాదాల సైజులకు అనుగుణంగానే బూట్లు , సాక్స్‌లను సరఫరా చేయనున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో కానుకలను ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖాధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

సిద్ధమవుతున్న పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు 8.91 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం. వచ్చే విద్యా సంవత్సరానికి అంతా సన్నద్ధమవుతున్న తరుణంలో బడి తెరిచిన తొలిరోజునే పాఠ్యపుస్తకాలు విద్యార్థుల చేతికిచ్చేలా అధికారులు దృష్టి సారించారు. సెమిస్టర్ల వారీగా పుస్తకాలు సరఫరా చేస్తున్నందున, మొదటి దఫాగా ఇవ్వాల్సిన పుస్తకాలు ముద్రణ ఇప్పటికే ప్రారంభించారు. దీనిపై 2023–24 విద్యా సంవత్సరం గణాంకాల మేరకు ముందస్తు అంచనాలతో పుస్తకాల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 1.01 లక్ష మందికి ప్రయోజనం

విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 587 స్కూళ్లలో చదువుతున్న 1.02 లక్షల మందికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా విద్యాకానుక అందజేస్తున్నారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యా సంవత్సరానికి కూడా విద్యార్థులందరికీ విద్యాకానుక అందించాలనేది ప్రభుత్వ ముందస్తు నిర్ణయం. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు కానుకలను రెడీ చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్, బెల్టులు, బూట్లు, సాక్స్, మూడు జతల యూనిఫారాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, విద్యా డిక్షనరీతో కలిపి తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్ ఇస్తున్నారు.

ఏటా రూ.20 కోట్ల వ్యయం

రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టెండర్ ప్రక్రియలో భాగంగా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక కిట్‌కు ప్రభుత్వం రూ.1,964లు వ్యయం చేస్తోంది. బయట మార్కెట్‌లో దీనికి రూ.5 వేలుకు పైనే ఉంటుంది. జిల్లాలోని విద్యార్థులకు పంపిణీ చేసే నిమిత్తం ఏటా రూ.20 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చుచేస్తూ వచ్చింది. ఈ లెక్కన నాలుగు దఫాలుగా రూ.80 కోట్లతో జిల్లాలోని విద్యార్థులకు విద్యాకానుకను ప్రభుత్వం అందజేసిందన్నమాట. ఇదే బయట మార్కెట్‌ను పరిగణలోకి తీసుకుంటే, రూ.200 కోట్లపైనే ఉంటుంది. ఈ రీతిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది.